# 2023

## 22 అనువాదం సులువుగా




**మెటాకు చెందిన** ఎం4టీ ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) మాడల్ సాఫ్ట్‌వేర్ 100 భాషలను అర్థం చేసుకుంటుంది. అది మాటల రూపంలోనైనా, రాత రూపంలోనైనా. అంతేకాదు, ఇప్పటివరకూ ఉన్న ట్రాన్స్‌లేషన్ సాఫ్ట్‌వేర్‌లలో కృత్రిమత్వం ఎక్కువ. పొరపాట్లకు ఆస్కారమూ అధికమే. ఎం4టీతో ఆ ఇబ్బంది లేదు. మెటా దీనిని అందరికీ అందుబాటులో ఉంచడం విశేషం. ఈ కోడ్‌ను ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు నిరభ్యంతరంగా వాడుకోవచ్చు.

## 23 బాలింతల డిప్రెషన్‌కు మందు




**నవమాసాలు** మోసి శిశువుకు జన్మనిచ్చాక తల్లి ఒక రకమైన కుంగుబాటుకు లోనవుతుంది. బాధ, భయం, అలసట ఆమెను ఆవరిస్తాయి. దీన్నే పోస్ట్ పార్టమ్ డిప్రెషన్ అంటారు. ఇది తల్లి, పిల్లల మధ్య బంధం ఏర్పడకుండా అడ్డుకుంటుంది. ఈ సమస్యకు విరుగుడుగా జురానొలోన్ లేదా జుర్జువే అనే మాత్ర అందుబాటులోకి వచ్చింది. దీనికి అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదం కూడా లభించింది. శిశువు జన్మించిన తర్వాత 14 రోజులపాటు తల్లి ఈ మాత్రను రోజూ వేసుకోవాలి. సేజ్ థెరాపెటిక్స్ అండ్ బయోజెన్ తయారుచేసిన ఈ బిళ్ల మూడు రోజుల్లోనే తల్లి మూడ్‌ను మెరుగుపరుస్తుంది. తల్లీ బిడ్డల అనుబంధాన్ని బలోపేతం చేస్తుంది.

## 24 మూగ జీవాలకు రక్షణ కవచం

**భారతదేశం,** ఆఫ్రికా ఖండాల్లో ఏనుగులు, పులులు అంతరించే దశకు చేరుకోవడానికి ప్రధాన కారణం వేట. అభయారణ్యాల్లోనూ వన్యమృగాలను రక్షించుకోవడం కష్టంగా మారింది. మూగజీవాల్ని పరిరక్షించే దిశగా అమెరికాకు చెందిన పర్యావరణ సంస్థ రిజాల్వ్ 'ట్రెయిల్‌గార్డ్ ఏఐ' అనే పరికరాన్ని అభివృద్ధి చేసింది. దీనికి చిన్నచిన్న కెమెరాలు ఉంటాయి. దీని సాయంతో అంతరించిపోతున్న జీవజాతుల కదలికల్ని, వేటగాళ్ల కుట్రల్ని పర్యవేక్షించడం సులభం అవుతుంది. ఇది సెల్‌ఫోన్, లాంగ్ రేంజ్ రేడియో సిగ్నల్స్‌ను ఉపయోగించుకుంటుంది. ఏ జంతువుకైనా అపాయం ఏర్పడితే 30 సెకండ్లలోనే సంబంధిత అధికారులకు సమాచారం చేరవేస్తుంది. ట్రెయిల్‌గార్డ్ ఏఐని జంతువులకే కాదు మనుషుల కోసమూ వాడుకోవచ్చు. తూర్పు ఆఫ్రికాలో ఇప్పటికే 30 మందికి పైగా వేటగాళ్ల ఆటకట్టించారు. పులులు ఎక్కువగా ఉండే మధ్య భారతదేశంలో వీటి వాడకానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.



